భక్తి శ్రద్ధలతో గణపతి హోమం



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ సాయి ఐశ్వర్య కాలనీ వినాయక మండపం వద్ద ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో కాలనీ వాసులు గణపతి హోమం నిర్వహించారు. కాలనీవాసులు, ఉత్సవ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఉప్పల్ మినీ శిల్పారామంలో ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: మినీ శిల్పారామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆదివారం సుందరి రవిచంద్ర శిష్య బృందంచే నిర్వహించిన భరతనాట్య ప్రదర్శన ఎంతగానో అలరించింది. శ్లోకాలు, పుష్పాంజలి, స్వరాంజలి, మల్లరి గురు అష్టకమ్, శ్రీశారదా, భజన, దశరథ, భజగోవిందా, పాహిమా రామప్రభు, రామచంద్ర రారా, హరిహరి రామనామ, భజరేయ్ తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి మెప్పించారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాజీ మేయర్ బుచ్చిరెడ్డి

బోడుప్పల్: సమాజంలో ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందాలని బోడుప్పల్ మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి అన్నారు. టెలిఫోన్ కాలనీ గణేష్ అసోసియేషన్, వజ్ర హాస్పిటల్స్ సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందాల్సిన అవసరం ఉందన్నారు. శ్రీ గణేష్ అసోసియేషన్ కమిటీ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, మహేందర్, ధర్మేందర్‌రెడ్డి, రమేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ కలలను సాకారం చేద్దాం

బోడుప్పల్: అంబేడ్కర్ కన్న కలలను సాకారం చేద్దామని అంబేడ్కర్ ఆశయసాధన సంఘం రాష్ట్ర అధ్యక్షులు నత్తి మైసయ్య అన్నారు. బోడుప్పల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి 341వ జ్ఞానమాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో మహిళలకు సముచిత స్థానం కల్పించాలన్నారు. భూ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుగ్గ మైసయ్య, రాపోలు శ్రీరాములు, యాకయ్య, చిల్ల అంజయ్య, బయన్న, యేసు రాజు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణకు

ముందడుగు !



చెంగిచర్ల రోడ్డు విస్తరణ పనులు

ప్రారంభమైన చెంగిచర్ల రోడ్డు పనులు

- రూ.19.60 కోట్ల నిధుల మంజూరు
- పనులు పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు

బోడుప్పల్: నగర పాలక సంస్థ పరిధిలో రోడ్డు విస్తరణ పనులకు రూ 19.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మొదటగా రూ.9.85 కోట్లతో బంగారు మైసమ్మ దేవాలయం నుంచి చెంగిచర్ల చింతల చెరువు సాయి రెసిడెన్సీ జంక్షన్ వరకు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి పూర్తి చేసేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. ఈ రహదారి 2.5 కి.మీ ఉండగా.. విస్తరణ పనుల్లో భాగంగా మున్సిపల్ అధికారులు రోడ్డుకు ఇరువైపుల ఉన్న చెట్లను జేసీబీతో తొలగింపజేశారు. అనంతరం విద్యుత్ స్తంభాల తరలింపు, నిర్మాణాలను తొలగించే పనిలో అధికారలు నిమగ్నమయ్యారు.

హెచ్ఎండీఏ నుంచి నిధులు

నగర పాలక సంస్థలో నిధుల కొరత ఉండటంతో గత పాలకవర్గం, అధికారులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం 4 ప్రధాన రహదారులకు రూ.34.45 కోట్లు అంచనా ప్రతిపాదనలు పంపించారు. ఇదే విషయమై పలుమార్లు బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కమిషనర్లు కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన చొరవతో తొలుత చిలుకానగర్, చెంగిచర్ల రోడ్డు విస్తరణ పనులకు హెచ్ఎండీఏ నుంచి రూ.19.60 కోట్ల నిధులు మంజూరయ్యాయి.

జనాభాకు అనుగుణంగా విస్తరణ

గతంలో గ్రామపంచాయతీ ఉన్నప్పుడు చెంగిచర్ల రోడ్డును 15 అడుగులు చేశారు. అప్పటి జనాభాకు తగినట్లుగా సరిపోయింది. ప్రస్తుతం కాలనీల విస్తరణతో పాటు జనాభా కూడా పెరిగింది. దీనికి తోడు వాహనాల సంఖ్య కూడా రెట్టింపయ్యాయి. ఇరుకు రోడ్డుతో నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం కావడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు.

ప్రారంభమైన రోడ్డు విస్తరణ పనులు

బంగారు మైసమ్మ దేవాలయం నుంచి చింతల చెరువు సాయి రెసిడెన్సీ వరకు 2.5 కి.మీ విస్తీర్ణంలో రూ.9.85 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. ఈ రోడ్డును 60 అడుగులకు విస్తరించి మధ్యలో డివైడర్ ఏర్పాటుతో పాటు సెంట్రల్ లైటింగ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నారు.

అటవీశాఖ అనుమతితోనే చెట్ల తొలగింపు

అటవీశాఖ అధికారుల నుంచి అనుమతులు తీసుకుని ఈ రహదారిలో ఉన్న చెట్లను మున్సిపల్ అధికారులు తొలగిస్తున్నారు. ఇదే రోడ్డులో ఉన్న పెద్ద చెట్లను మాత్రం లిఫ్టింగ్ చేసి నారాపల్లిలో ఉన్న నందన వనం పార్కుకు 42 చెట్లను తీసుకెళ్లనున్నారు. అలాగే విద్యుత్ సిబ్బంది దృష్టికి సమాచారం తీసుకెళ్లి విద్యుత్ స్తంభాల తరలింపునకు సహకరించాలని కోరారు.

పూర్తి స్థాయి ప్రణాళికను రూపొందించాం..



రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు పూర్తిస్థాయి ప్రణాళికలు రూపొందించాం. రోడ్డు విస్తరణ, చెట్ల తొలగింపు, విద్యుత్ స్తంభాల తరలింపు, అడ్డంగా ఉన్న నిర్మాణాల తొలగింపునకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

– శైలజ, బోడుప్పల్ మున్సిపల్ కమిషనర్

మెరుగైన రవాణా సౌకర్యం



ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నాం. హెచ్ఎండీఏ ద్వారా చెంగిచర్ల రోడ్డుకు రూ.9.85 కోట్లు, చిలుకానగర్‌కు రూ.9.75 కోట్లు మంజూరు చేయించాం. పనులు వేగవంతంగా పూర్తి చేసేందుకు మున్సిపల్ అధికారులు, విద్యుత్ స్తంభాల తరలింపునకు ఉన్నతాధికారులతో మాట్లాడాం. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.

– అజయ్‌యాదవ్, మాజీ మేయర్

రాహుల్‌గాంధీ క్షమాపణ చెప్పాలి



ఉప్పల్ వీటి కమాన్ వద్ద దిష్టి బొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

ఉప్పల్: ప్రధాని మోదీ మాతృమూర్తిపై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్‌రావు పిలుపు మేరకు ఉప్పల్ డివిజన్ అధ్యక్షుడు మార్నేని ఫణీందర్ ఆధ్వర్యంలో బీజేపీ నేతలు ఆదివారం ఉప్పల్ విటీ కమాన్ వద్ద రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రవణ్‌కుమార్‌గౌడ్, విఠల్‌రావు, రమేష్, నాగరాజుగౌడ్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

అల్వాల్: ప్రధాని నరేంద్రమోదీ మాతృమూర్తిపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం అల్వాల్‌లో బీజేపీ నేతలు నిరసన చేపట్టారు. రాహుల్‌గాంధీ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అనంతరం అల్వాల్ పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. మాణిక్యంరెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, కార్తీక్‌గౌడ్, లక్ష్మణ్‌ముదిరాజ్, మురళి, రవికిరణ్, కరుణశ్రీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి: వినాయక చౌరస్తాలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. బీహార్ ఎన్నికల ప్రచారంలో రాహుల్‌గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బీజేపీ నేతలు ఆనంద్, రాము, సాయిరాం, సాగర్, రవి, సుశీలమ్మ, జయమ్మ, లత తదితరులున్నారు.



కుషాయిగూడలో..

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్ బీజేపీ నేతలు కుషాయిగూడ బస్టాండ్ వద్ద రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. తీరు మార్చుకోకపోతే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. బీజేపీ డివిజన్ పార్టీ అధ్యక్షుడు చల్లా ప్రభాకర్, నాయకులు నాదం, లక్ష్మణ్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, హరినాయక్, బ్రహ్మచారి, జనార్దన్, యాదయ్య, రామకృష్ణ, రాంబాబు, శ్రీకాంత్, రాజు, లక్ష్మీనారాయణ, వివేక్, దయానంద్, అనిల్, వెంకటేష్, రాఘవేందర్ పాల్గొన్నారు.

అన్నదానం

కుషాయిగూడ: వినాయక మండపాల వద్ద గణనాథుడికి పూజలతో పాటు పెద్దఎత్తున అన్న ప్రసాద వితరణ జరిగింది. చర్లపల్లి డివిజన్ సుభాష్‌నగర్ కాలనీలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పిల్లల ఆటపాటలు, కేరింతలతో ఉట్టి కొట్టడం, కోలాటాలతో సందడి చేశారు.

డీజే నిర్వాహకుల అరెస్ట్

కుషాయిగూడ: నిబంధనలను అతిక్రమించి నిమజ్జన వేడుకల్లో ఈ వెంట్‌లు నిర్వహిస్తున్న రెండు డీజేలను సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సుధాకర్ తెలిపారు. శనివారం రాత్రి చర్లపల్లిలో నిర్వహించిన వినాయక నిమజ్జనాల్లో నిబంధనలను ఉల్లంఘించి వినియోగిస్తున్న రెండు డీజేలను గుర్తించి సీజ్ చేసినట్లు వివరించారు. నిర్వాహకులు మధు, తరుణ్‌లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలను విధిగా పాటించాలని, అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్రాంతి కీన్ ఆధ్వర్యంలో 'మొక్క నాటు గిఫ్ట్ పట్టు'

కీసర: దమ్మాయిగూడ క్రాంతి కీన్ ఆధ్వర్యంలో 'మొక్క నాటు గిఫ్ట్ పట్టు' లక్కీ డ్రా కార్యక్రమాన్ని నిర్వహించారు. మొక్క నాటి సెల్ఫీ దిగి పంపిన ప్రతి పదిమందిలో ఒకరిని ఎంపిక చేసి లక్కీ డ్రా ద్వారా విజేతలకు ప్రిన్సిపాల్ కల్యాణి స్టీల్ వాటర్ బాటిళ్లను అందజేశారు. మెగా లక్కీ విన్నర్‌కు రేంజర్ సైకిల్ బహుమతిగా అందజేశారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాలిస్తే కఠిన చర్యలు



ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ శైలజ

బోడుప్పల్: బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని బోడుప్పల్ కమిషనర్ శైలజ హెచ్చరించారు. ఆదివారం నగర పాలక సంస్థ కార్యాలయంలో వ్యర్థాల కాల్చివేతపై జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల పర్యావరణంపై ప్రభావం చూపుతుందన్నారు. గాలిలో కార్బన్ మోనాక్సైడ్, డయాక్సిన్లు, ఫ్యూరాన్లు, కణిక పదార్థం వంటి విషవాయువులు విడుదలై శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నారాయణరెడ్డి, హెల్త్ అసిస్టెంట్ వినోద్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ నిఖిల్, వార్డు ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జనానికి తరలిన గణనాథులు



మల్లాపూర్: వాయిత్ టర్బో కంపెనీలో వినాయకచవితి వేడుకలు ఘనంగా జరిగాయి. ఐదవరోజు డప్పు వాయిద్యాల నడుమ కోలాహలంగా గణపయ్యను నిమజ్జనానికి తీసుకెళ్లారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. హెచ్ఆర్.మోహన్, కిరణ్‌కుమార్, నర్సింగరావు, లక్ష్మీరేఖ, ఉద్యోగులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మౌలాలి: చంద్రగిరికాలనీలోని కృపా కాంప్లెక్స్ మార్వెల్ కిడ్స్ ప్లే స్కూల్ ఆధ్వర్యంలో జరిగిన నిమజ్జన వేడుకల్లో చిన్నారులు బుజ్జి గణనాథులను ఊరేగింపుగా తీసుకుని వచ్చారు. ఈ సందర్భంగా బండ చెరువు కొలనులో నిమజ్జనం చేశారు. ప్రిన్సిపాల్ సత్యవతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నిమజ్జనానికి వచ్చిన చిన్నారులు

పార్కు స్థలాన్ని అప్పగించాలని నిరసన



అల్వాల్: హుడా అనుమతితో ఏర్పాటు చేసిన ఫాదర్ బాలయ్యనగర్‌లో పార్కుకు కేటాయించిన స్థలాన్ని ఇతర అవసరాలకు ఉపయోగించకూడదని కాలనీవాసులు ఆదివారం ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ.. హుడా లేఅవుట్ ప్రకారం 460 ప్లాట్లు ఏర్పాటు చేసిన ఇందులో 1900 గజాల స్థలం పార్కు కోసం కేటాయించగా.. కొంతకాలం తర్వాత అందులో లయోలా పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేశారని, 2011 నుంచి సమస్యపై కోర్టులో కేసు ఉందని కాలనీవాసులు చెబుతున్నారు. తహసీల్దార్ కార్యాలయానికి తమ పార్కు స్థలాన్ని కేటాయించారన్నారు. ప్రశాంతంగా ఉన్న కాలనీలో వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభమవుతాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని అధికారులను కోరారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు జార్జ్ నిఖిల్, చిన్నపురెడ్డి, డేవిడ్ అలెగ్జాండర్, స్మిత, శ్రీనిధి, కాలనీవాసులు, చిన్నారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సెప్టెంబర్ 13,14న తెలంగాణ రాష్ట్ర మహాసభలు

కీసర: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని దమ్మాయిగూడ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు బంగారు నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం దమ్మాయిగూడ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 13,14న తెలంగాణ రాష్ట్ర మహాసభల నేపథ్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, వారికి ప్రభుత్వ ఆరు గ్యారంటీలు అమలు చేయాలన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని తుర్కయాంజాల్‌లో తెలంగాణ రాష్ట్ర మహాసభలు నిర్వహించబోతున్నామని ప్రకటించారు. వెంకటేష్, కృష్ణ, ముక్కెల కృష్ణ, దశరథ్, గోపాల్, అశోక్, బలరాం, గోపి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

7న రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

జవహర్‌నగర్: ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలని సెప్టెంబర్ 7న నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి శివబాబు పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. కార్మికులందరికీ కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులందరికీ డబుల్ బెడ్రూమ్‌లు మంజూరు చేయాలన్నారు. కార్మికులు ప్రమాదంలో మృతిచెందితే రూ.20 లక్షలు ఎక్స్‌గ్రేషియా, సాధారణ మరణం పొందితే రూ.10 లక్షలు, దహన సంస్కారాలకు రూ.30 వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ కార్మికులందరికీ అందచేయాలని డిమాండ్ చేశారు.





చిన్నారులతో తెలుగు యూనివర్సిటీ రిటైర్డ్ వైస్ చాన్స్‌లర్ భూమయ్య



మల్లాపూర్‌లో కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి



మిర్జాలగూడ జైగణేష్ ఫ్రెండ్స్ అసోసియేషన్‌లో..



సుభాష్‌నగర్ వినాయక మండపం వద్ద..

లంబోదరుడికి వాడవాడలా విశేష పూజలు



ప్రత్యేక పూజల్లో బీఆర్ఎస్ నాయకులు

ఉప్పల్: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఐదోరోజున గణనాథుడికి వాడవాడలా విశేష పూజలు జరుగుతున్నాయి. ఆదివారం ఆయా ప్రాంతాల్లో కార్పొరేటర్లు, ఎమ్మెల్యే, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రత్యేక పూజలు చేశారు.

మల్లాపూర్: కేఎల్‌రెడ్డినగర్, బ్రహ్మపురి కాలనీ, న్యూ భవానీనగర్, ఓల్డ్ మల్లాపూర్‌లో లంబోదరుడికి విశేష పూజలు అందుకుంటున్నాడు. మల్లాపూర్ కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

రామంతాపూర్ : రామంతాపూర్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మండపాల్లో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, కక్కిరేణి చేతనాహరీష్ ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఐశ్వర్య హైట్స్ అపార్ట్‌మెంట్‌లో మహిళలు వినాయక మండపంలో కుంకుమార్చన చేశారు.

అల్వాల్/కుషాయిగూడ : నియోజకవర్గ పరిధిలో వినాయక నవరాత్రి పూజలు భక్తి శ్రద్ధలతో చేపట్టారు. పలుచోట్ల అన్న ప్రసాద వితరణ చేశారు.

గౌతంనగర్: డివిజన్ పరిధిలో వినాయక నవరాత్రి పూజలు ఘనంగా జరిగాయి. వినాయకులను నిమజ్జనాలకు తరలించారు.



మల్లికార్జుననగర్‌లో గజానన యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..



బాలాజీహిల్స్‌లో పాల్గొన్న మాజీ మేయర్ అజయ్‌యాదవ్



మల్కాజిగిరి వసంతపురి కాలనీలో..



ఉప్పల్ ఆదర్శనగర్‌లో కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి తదితరులు



ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ శ్రీవాణి



అల్వాల్ లక్ష్మీ ఎన్‌క్లేవ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..